## క్లుప్తంగా

### ఏలూరు పోక్సో కోర్టు పీపీ శశిధర్ మృతి



శశిధర్ రెడ్డి (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్ పేట): ఏలూరు పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాజిక్యూటర్‌గా పని చేస్తున్న తేతలి శశిధర్ రెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. శుక్రవారం కోర్టు విధులకు హాజరైన శశిధర్ శుక్రవారం మధ్యాహ్నం కడుపులో నెప్పిగా ఉందని ఇంటికి వెళ్లగా అక్కడి నుంచి విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆయనను కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శశిధర్ రెడ్డి గతంలో ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేసిన న్యాయవాదుల్లో ప్రత్యేక గుర్తింపు పొందడమే కాక న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన అకాల మృతికి ఏలూరు బార్ అసోసియేషన్, జ్యుడీషియల్ ఉద్యోగులు, పలువురు ప్రముఖ న్యాయవాదులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### తాగునీటి బోరుకు మరమ్మతులు

ఏలూరు రూరల్: ఏలూరు నగర కార్పొరేషన్ పరిధి 15 డివిజన్ నెహ్రూనగర్‌లో తాగునీటి సమస్యను స్థానిక కార్పొరేటర్ తంగెళ్ల రాము పరిష్కరించారు. శనివారం బిట్ -1, 2లో ప్రాంతంలో తాగునీరు సరఫరా చేసే బోరు పాడయ్యింది. దీంతో ఈ ప్రాంత ప్రజలకు ఉదయం తాగునీరు సరఫరా కాలేదు. దీన్ని గుర్తించిన కార్పొరేటర్ అధికారుల ద్వారా స్థానిక ప్రజలకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయించారు. అనంతరం పాడైన బోర్‌కు మరమ్మతులు చేపట్టారు. 15 డివిజన్ వైఎస్సీపీ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి రంగముత్యాలు, సచివాలయ కన్వీనర్ ఎలగా అన్నవరం, డి జయ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

### జీత భత్యాలు పెంచాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో బాధిత కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికి విశేషంగా కృషిచేస్తున్న టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఏపీపీల (అసిస్టెంట్ - అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు) జీతభత్యాలను పెంచాలని రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ జె. సుదర్శన రెడ్డిని టెన్యూర్ ఏపీపీల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు విజయవాడలోని ఆయన కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సుదర్శన రెడ్డికి శాలువాలు కప్పి సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచంట వెంకటేశ్వరరావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సీహెచ్ రాజేంద్రప్రసాద్, రాష్ట్ర నాయకులు కోనె సీతారామారావు, డీవీ రామాంజనేయులు, నిమ్మల రాము, పీడీజే కోర్టు గవర్న మెంట్ ప్లీడర్ (జీపీ) బీ. జగన్నాథ రెడ్డి తదితరులున్నారు.

### మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని యూనియన్ (ఆంధ్రాబ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగులకు వివిధ వృత్తి విద్యల్లో ప్రత్యేక శిక్షణ అందించి వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ వై. భాను ప్రవీణ తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 7 నుంచి మగ్గం వర్క్స్ అంశంలో గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 5వ తరగతి ఆ పైన విద్యార్హతలు కలిగి, 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పేర్లను 9502723561, 9948565256 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చన్నారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు కోర్సులో ప్రవేశాలకు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లు, 3 కలర్ పాస్ పోర్ట్ ఫొటోలు సమర్పించాలన్నారు.

### 9 నుంచి వ్యాసరచన పోటీలు

ఏలూరు రూరల్: డబై అయిదేళ్ల స్వాతంత్ర దినోత్సవం, అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీ నుంచి 15 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని విజ్ఞానకేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. స్థానిక అన్నేభవన్‌లో నిర్వహించిన సమావేశ వివరాలు వెల్లడించారు. కాలేజీ విద్యార్థులకు భారత స్వాతంత్ర పోరాటంలో యువజనులు, విద్యార్థుల పాత్ర అనే అంశం, హైస్కూల్ విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు మన్యం విప్లవం అనే అంశాలపై 9 నుంచి 11వ తేదీ వరకూ హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు వేర్వేరుగా వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 74166-71480 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

### 7న నగరంలో ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఎస్. రఘునంద తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని, ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకూ నిర్వహిస్తామని, చేనేత కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో చేనేత కార్మికులను సత్కరించనున్నట్లు తెలిపారు.

# అక్కాచెల్లెమ్మలకు తోడుగా సీఎం జగనన్న

- గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ
- ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్



ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేస్తున్న మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ ఎన్. సుధీర్ బాబు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ప్రతి అక్కాచెల్లెమ్మల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ పెద్దలా తోడుగా ఉంటున్నారని, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేలా పౌష్టికాహారాన్ని అందించే విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ చెప్పారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పాత కౌన్సిల్ హాలులో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ఆదేశాలతో ఏలూరు నియోజకవర్గంలోని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు మేయర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టేక్ హోమ్ కిట్లు అందజేశారు. ఏలూరు నియోజకవర్గంలో 205 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు 1,608 మంది, బాలింతలు 1,222 మంది ఉండగా వీరందరికీ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. వైఎస్సార్ కిట్లలో బియ్యం, కందిపప్పు, వంటనూనె, కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, రాగి పండి, అటుకులు, బెల్లం, వేరుశనగ చిక్కీ, ఎండు ఖర్జూరం తదితర పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ సమాజంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి రక్తహీనతను తొలగించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతీ నెలా మొదటి, మూడో శుక్రవారం రేషన్ పంపిణీ చేస్తున్నారని చెప్పారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని మేయర్ కోరారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మేయర్ పరిశీలించారు.

**అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ క్లీనింగ్‌కు సక్షన్ మిషన్**

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ క్లీనింగ్ విషయంలో ఇకపై సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టామని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.40లక్షలతో కొనుగోలు చేసిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ క్లీనింగ్ చేసే సక్షన్ మిషన్‌ను నగర మేయర్ శనివారం ప్రారంభించారు. గతంలో ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ శుభ్రం చేసే ప్రక్రియకు తీవ్ర ఆటంకాలు ఏర్పడేవని, ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే ఆళ్లనాని చొరవతో సక్షన్ మిషన్ కొనుగోలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కే.పద్మావతి, ఇన్‌ఛార్జ్ సీడీపీవో ఏ.లలిత, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయ నిర్మల, ఈదుపల్లి కళ్యాణి, సబ్బన శ్రీనివాస్, కలవకొల్లు సాంబ, ఆరేపల్లి రాధిక సత్తిబాబు, కోఆప్షన్ సభ్యులు నీతా జైన్, తదితరులు ఉన్నారు.

### రాష్ట్రం దాటి పింఛన్ అందజేత



నగరంలోని శనివారపుపేటకు చెందిన మునగల సురేఖ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండె శస్త్ర చికిత్స చేయించుకుని బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటోంది. ఈమెకు ఏలూరు నుంచి హైదరాబాద్ వెళ్లి వలంటీర్ టీ.రాణి వితంతువు పింఛన్ నగదు అందజేసింది. దూరం నుంచి వచ్చి పింఛన్ అందజేసిన రాణికి లబ్ధిదారు కృతజ్ఞతలు తెలిపారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

# బంగారంపై మక్కువతో చోరీలు

- కిలాడి మహిళను అరెస్ట్ చేసిన పోలీసులు
- ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు



ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, టూటౌన్ సీఐ చంద్రశేఖర్

ఏలూరు టౌన్: తాను బ్యూటీషియన్ అంటూ మహిళల అందాలకు మెరుగులు దిద్దుతానని చెబుతూ ఇంట్లోకి వెళుతుంది. ఇంట్లో చోరీ చేసేందుకు అనుపాను తెలుసుకుని దొంగతనాలకు పాల్పడుతుంది. ఇళ్లల్లోకి చొరబడి చోరీలకు పాల్పడే కిలాడి మహిళను ఏలూరు టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్, ఎస్సై నాగబాబు, సిబ్బంది ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన పందిరి జ్యోతి చాలా ఏళ్ల క్రితమే ఏలూరు నగరానికి మకాం మార్చింది. జ్యోతి బాలికగా ఉన్న నాటి నుంచే చోరీలకు అలవాటు పడింది. చిన్నప్పుడే ఒక బంగారం చోరీ కేసులో పోలీసులు అమెను అరెస్టు చేయగా జువైనల్ హోమ్‌లో శిక్ష అనుభవించింది. అనంతరం ఏలూరులోనే ఒక వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకునేందుకు సిద్ధపడింది. ఈలోగా మరో చోరీ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం ఆమె ఏలూరు తంగెళ్ళమూడి పుష్పలీలానగర్‌కు చెందిన పందిరి సంతోష్‌ను పెళ్లి చేసుకుంది. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. కానీ చోరీలను మాత్రం మానుకోలేకపోయింది. బంగారంపై జ్యోతికి మక్కువ అధికంగా ఉండడంతో భర్తకు తెలియకుండానే చోరీలకు పాల్పడుతుంది.

ఏలూరు టూటౌన్ పరిధిలో ఇటీవల వరుసగా ఇళ్లల్లో దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం వాహన తనిఖీల్లో పోలీసులకు జ్యోతి అనుమానాస్పద స్థితిలో తారసపడింది. ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఏలూరు నగరంలో 7 చోరీల్లో ఆమె నిందితురాలిగా గుర్తించారు. ఆమె నుంచి 130 గ్రాముల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి ఆభరణాలు, రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ జ్యోతికి వివాహమై భర్త, కుమారుడు ఉన్నప్పటికీ చోరీలు చేస్తుందని తెలిపారు. ఆమెను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ చంద్రశేఖర్, ఎస్సై నాగబాబు, హెడ్‌కానిస్టేబుల్స్ రవి, సీతయ్యను ప్రత్యేకంగా అభినందిస్తూ రివార్డులను అందించారు.

# ఏలూరులో జస్టిస్ రఘునందనరావు



పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి, జస్టిస్ రఘునందనరావుతో మాట్లాడుతున్న కలెక్టర్, ఏలూరు రేంజ్ డీఐజీ, ఎస్పీ తదితరులు

ఏలూరు(మెట్రో) : పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి, జస్టిస్ రఘునందనరావు శనివారం ఏలూరు విచ్చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రఘునందనరావు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. శనివారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులకు నిర్వహించే రివ్యూలో పాల్గొనేందుకు విచ్చేసిన జస్టిస్ రఘునందనరావు స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్‌లో కొంతసేపు బస చేశారు. ఈ సందర్భంగా ఏలూరు విచ్చేసిన జస్టిస్ రఘునందనరావుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ రఘునందనరావును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్క అందజేశారు. జస్టిస్ రఘునందనరావును ఏలూరు రేంజి డీఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం జస్టిస్ రఘునందనరావు వారితో కొద్దిసేపు ముచ్చటించారు.



# ప్రపంచ నృత్య రీతుల్లో కూచిపూడి కలికితురాయి



నర్తనబాల అవార్డులు అందుకున్న కూచిపూడి నృత్య కళాకారిణులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచంలో ఎన్నో నృత్య రీతులు ఉన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పుట్టి విశ్వ కీర్తి పతాకలో కూచిపూడి నృత్యం కలికితురాయిగా నిలిచిందని రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. నగరానికి చెందిన అభినయ నృత్య భారతి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డీ. మేమ సుందర్ ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలులో రెండురోజుల పాటు నిర్వహించే నర్తన బాల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీలక్ష్మి మాట్లాడుతూ కూచిపూడి నృత్యానికి ఏలూరు నగరం పెట్టనికోటగా నిలుస్తుందని, నగరానికి చెందిన అనేక మంది కళాకారులు ప్రపంచ వ్యాప్తంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇవ్వడమే కాకుండా విదేశాల్లో సైతం ఈ నృత్య కళను అభివృద్ధి చేయడానికి వివిధ దేశాల్లో అనేక మంది నృత్య కళాకారులను తయారు చేయడం ఆహ్వానించ దగ్గ పరిణామమని ఆమె అన్నారు. కూచిపూడి నృత్య కళ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారిణులు పలు త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలకు నగర ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం నృత్య ప్రదర్శనలు చేసిన కళాకారిణిలను ప్రముఖులు ఘనంగా సత్కరించి నర్తన బాల అవార్డును ప్రదానం చేశారు. కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, వేంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ తోలేటి శ్రీని వాస్, బీవీఆర్ కళాక్షేత్రం అధినేత బీవీ రామా రావు, హిందూ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ లునాని పాల్గొన్నారు.



## మనసును ప్రశాంతంగా ఉంచుకోండి



వైద్యులకు జ్ఞాపికలు అందించి సత్కరించిన బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని, మన భావోద్వేగాలు, మనో భావాలను అణచిపెడితే రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రధాన కేంద్రం మౌంట్ అబూ నుంచి విచ్చేసిన సీనియర్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ ప్రేమ్ మసంద్ తెలిపారు. స్థానిక శ్రీరామ్ నగర్ ఆరవ రోడ్డులోని బ్రహ్మకుమారి సేవా కేంద్రంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ప్రముఖ డాక్టర్లతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్వినప్పుడు మనలోని హ్యాపీ హార్మోన్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ స్థానం ఎంతో ఆధ్యాత్మికతతో నిండి ఉందని అన్నారు. డాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్లకు కూడా ఎమోషనల్ స్టెబిలిటీ అవసరమన్నారు. ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. సదాశివ రావు మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థలో మహిళలకు అగ్రస్థానం ఇచ్చారని అన్నారు. డాక్టర్ విజయమోహన్ మాట్లాడుతూ ప్రతి డాక్టర్ తన జీవితంలో ఒకసారైనా మౌంట్ అబూని సందర్శించాలని సూచించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ఏలూరు శాఖ నిర్వాహకురాలు బీకే లావణ్య మాట్లాడుతూ వచ్చే సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ మూడు వరకు జరిగే మెడికల్ కాన్ఫరెన్స్‌లో డాక్టర్లు అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు. అనంతరం అతిథులను, డాక్టర్లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించి, ప్రసాదాలు పంపిణీ చేశారు.

## కిట్టీ పార్టీలతో మహిళలకు నూతన ఉత్సాహం



కిట్టీ పార్టీలో ఉత్సాహంగా నృత్యం చేస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిత్యం కుటుంబ ఉన్నతికి కృషి చేస్తూ, బిడ్డలకు బంగారు భవిష్యత్ కోసం అహర్నిశలూ శ్రమిస్తూ ఎంత కష్టమైనా ఇష్టంగా చేసే మహిళలకు కిట్టీ పార్టీలు నూతన ఉత్సాహాన్నిస్తాయని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కూరాళ్ళ రమాదేవి స్పష్టం చేశారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన మెగా శ్రావణ లక్ష్మి సంబరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ నిర్వహణ బాధ్యతను తన భుజస్కంధాలపై మోసే మహిళలు ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఉత్తేజం పొందుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలంతా సంప్రదాయ వస్త్రధారణలో నృత్యాలతో, వివిధ ఆటల పోటీలతో, హౌసీ గేమ్‌లతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. ఈ వేడుకల్లో నిర్వహించిన లక్కీడిప్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 2 గ్రాముల బంగారం, ద్వితీయ బహుమతిగా 1.5 గ్రాముల బంగారం, తృతీయ బహుమతిగా గ్రాము బంగారం బహూకరించారు. మరో 20 మంది మహిళలకు ఒక్కొక్కరికీ అర గ్రాము చొప్పున బంగారం అందించారు. ఫస్ట్ లక్కీ డిప్‌లో గెలుపొందిన మహిళకు వాషింగ్ మెషీన్ బహూకరించారు. ఈ కార్యక్రమాన్ని తవ్వా శిరీష, కూరాళ్ళ హిమజ పర్యవేక్షించారు.

## 9న కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా నిరసన

ఏలూరు రూరల్: ఈ నెల 9న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా క్విట్ కార్పొరేట్, దేశ్ కి బచావో కార్యక్రమం నిర్వహించనున్నామని సంయుక్త కిసాన్‌మోర్చా నాయకులు తెలిపారు. శనివారం ఏలూరు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఏఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన పలు సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె శ్రీనివాస్, ఏఐకేకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి రంగనాథ్, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతోపాటు బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఏలూరు మండలం అభివృద్ధికి జెడ్పీ నిధులు

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల అభివృద్ధి కోసం జిల్లా పరిషత్ నుంచి సుమారు రూ.కోటి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నానని ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి చెప్పారు. శనివారం జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొని, లేవనెత్తిన విషయాలను ఆమె వివరించారు. కొల్లేరులో సుమారు 400 డ్రెయిన్లను గుర్తించి పూడిక తీత చేపట్టి, అభివృద్ధి చేయడం వల్ల కొల్లేరు ప్రజలకు ముంపు బాధ తప్పుతుందని అధికారులకు సూచించానని చెప్పారు. ఇదే క్రమంలో ఏలూరు కైకులూరు రోడ్డులో అటవీశాఖ రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం వల్ల ఆక్వా సాగుదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఇందులో ఒక చెక్‌పోస్టు తొలిగించాలని అధికారులను కోరానన్నారు. పెదయాగనమిల్లి నుంచి గుడివాకలంక గ్రామానికి వెళ్లే రోడ్డు జెడ్పీ రోడ్డుగా అభివృద్ధి చేయాలన్నారు. పైడిచింతపాడు నుంచి కొల్లేటి కోట వరకూ ఉన్న జెడ్పీ రోడ్డును ఆర్అండ్‌బీ రోడ్డుగా మార్పుచేసి ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేయాలని సూచించానన్నారు. ప్రభుత్వం కొల్లేరు భూములు రీసర్వే చేపట్టి, మిగులు భూములు పేదలకు పంచేలా కృషి చేయాలని పాలకవర్గ సభ్యులను కోరినట్టు తెలిపారు.

## అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పాలనకు ప్రజలు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయాన్ని కట్టబెడతారని ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం మొండికోడు, జాలిపూడి పాటు పలు గ్రామాల వైసీపీ కార్యకర్తలు ఎంపీపీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా భూత్ లెవెల్ ఆఫీసర్లు తప్పిదం కారణంగా జాలిపూడి గ్రామానికి చెందిన 173 పోలింగ్ బూత్‌లో 850 ఓట్లను చాటపత్రులో తరలిపోయాయని స్థానిక వైసీపీ కాకర్ల తంబి ఎంపీపీ వద్ద వాపోయారు. దీనిపై స్పందించిన ఎంపీపీ తహసీల్దార్ బి సోమశేఖర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతున్నందున కార్యకర్తలు మరోసారి క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఏలూరు మండల గ్రామాల్లో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేసారని గుర్తు చేసారు. రూర్బన్, జలజీవన్ మిషన్, మండల పరిషత్ నిధులతో 15 గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా కొత్త పైప్‌లైన్, 11 ఓవర్ హెడ్ ట్యాంకులు, 5 వేల మంది పేదల ఇంటింటికీ కుళాయి ఉచితంగా అందించారని వివరించారు. వీటితో పాటు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు మంజూరు చేయించి కైకులూరు, కొల్లేరు రోడ్ల అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేసి పార్టీకి ప్రజల మద్దతు పెంచాలన్నారు. మొండికోడు ఉపసర్పంచ్ ఊటుకూరి ఏసు, వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, వజ్రం తదితరులు ఎంపీపీని కలిసిన వారిలో ఉన్నారు.

## నేడు గురు పురస్కారాల ప్రదానోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అఖిల భారత బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం గురు పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరానికి చెందిన బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు సీఏపీ శ్రీనివాస రామానుజాచార్యులు తెలిపారు. ఏలూరులోని రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జాలాపురం శ్రీకాంత్, అఖిల భారత బ్రాహ్మణ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రగంటి ప్రభాకర శర్మ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 60 మందికి పురస్కారాలు ప్రదానం చేస్తారన్నారు.